"అదేమిటి! మీకు రాజకీయాలు తెలియవా?"

"నేను మొదటినించి వాటికి దూరం"

"అదీ సంగతి. నేను ప్రస్తుతం మన రాష్ట్ర కేబినెట్‌లో వో ముఖ్యమయిన మంత్రిపదవిని నిర్వహిస్తున్నాను. ఎప్పుడు ప్రారంభిస్తారు?"

"సారీ! నా వల్ల కాదు"

"అలాగా? సరే నేను సి.యం. అవగానే ముందర చేసేపని మీ ఇన్‌స్టిట్యూట్‌ని మూయించేయడం, ముఖ్యమంత్రులని తయారుచేసే కాలేజీలు ఈ రాష్ట్రంలో ఉండకూడదు"

కోపంగా చెప్పి బయటకి నడిచాడాయన.

# అసత్య వాణి

ఆయనపేరు యెంతే గమ్మత్తుగా వుంటుంది. వృక్షాయుర్వేదాచార్యులు పేరు మరి తమాషాయేగా?

ఆ రోజు ఆగస్టు 17, 1984.

రాజకీయాల కారణంగా జంటనగరాలలో బంద్. ఉదయం నిద్ర లేచిన వృక్షాయుర్వేదాచార్యులకి క్రితంరోజు తను స్టేషన్‌నుంచి వస్తూ బ్లేడ్స్ కొనుక్కోవటం మర్చిపోయానన్న సంగతి గుర్తొచ్చింది సందు చివరున్న కొట్టుకి చిన్నకూతుర్ని పంపాడు బ్లేడు పేకెట్ కొనుక్కు రమ్మని.

"ఆ దుకాణం మూసేసి వుంది. ఇవాళబంద్ కదా నాన్నగారు" చెప్పింది తిరిగి వచ్చి.

"ఒక్క షాపు కూడా తెరిచిలేదా?" అడిగాడాయన.

"ఊహూ"

గడ్డం గీసుకోకుండానే బయటికి వెళ్ళాడు ఆ రోజు ఆర్.టి.సి బస్సులు లేవని తెల్సింది బస్‌స్టాప్‌కి వెళ్ళకుండానే, రేడియో స్టేషన్‌కి నడచికాని, రిక్షామీద కాని వెళ్ళేంతదూరం కాదాయె.

ఆటోలు చాలా తక్కువ వున్నాయి. ఏ ఆటోవాడ్ని పలకరించినా మీటర్ మీద చాలా అడుగుతున్నాడు. ఆర్.టి.సి బస్సుల్లేని రోజులలోనే వాళ్ళు కంపల్సరీ బోనస్‌ని సంపాదించుకోగలిగేది.

కొద్ది దూరం గడిస్తే ఆటోచేయవచ్చని నడక సాగించాడాయన.

ఎక్కడ చూసినా లాఠీలు, తుపాకులు, జీపులు, వేన్‌లు పోలీసు లన్నమాట రోడ్లకి అడ్డంగా చెత్తకుండీలు, ఇటుకరాళ్ళను పడేస్తున్నారు కొందరు సగం తెరచివున్న దుకాణాలని, ఆఫీసులని గదమాయించి మూయిస్తున్నారు మరికొందరు. నినాదాలు చేసుకుంటూ చాలామంది లారీల్లో తిరుగుతున్నారు.

అలవాటు ప్రకారం సిగరెట్ తాగుదామంటే ఒక్కకిళ్ళీకొట్టుకూడా తెరవలేదు. హైదరాబాదుకి బంద్‌లు అలవాటే అయినా పక్కపొడి పొట్లం కూడా కొనుక్కోలేనంతగా అంతకుముందెన్నడూ బంద్ జరగలేదు

ఆటోకోసం చూస్తే ఎక్కడా కనపడలేదు. కనుచూపుమేరలో ఆరోజు ఆటో డ్రైవర్లు కూడా చాలామంది బంద్‌లో పాల్గొన్నారు కాబట్టి ఏవో కొన్నే తిరుగుతున్నాయి.

అదృష్టవశాత్తు వో స్నేహితుడు స్కూటర్ మీద వెళుతూ ఆయన్ని చూసి ఆగి అడిగాడు.

"ఏం మాస్టారు. స్టేషన్‌కేనా?"

"అవునబ్బాయి" అని చెప్పి ఎక్కి వెనక సీట్‌లో కూర్చున్నాడు ఆయన.

"బంద్‌ట ముందు తెలీదు నాకు" చెప్పాడాయన.

"మీకేమండి హాయిగా ఇంట్లో భోజనం చేసి బయలుదేరుంటారు. హోటల్స్ లేని మాలాంటి బ్రహ్మచారులకి ఎంత అవస్థ" చెప్పాడు స్కూటర్ నడిపే కుర్రాడు.

దూరంగా పెద్ద గుంపు. పోలీసులు లాఠీలతో బాదుతున్నారు చేతికి చిక్కిన వాళ్ళనల్లా. స్కూటర్‌ని స్లో చేశాడతను. ఆపి ఇంజన్ ఆఫ్ చేయకుండా చూశాడు.

టియర్ గేస్ షెల్ పేలింది.

"గొడవగా వుంది వెనక్కి తిప్పు" చెప్పాడు వృశ్చియుర్వేదాచార్యులు

ఇంకో దారిపట్టాడతను దారినిండా రాళ్ళు, నినాదాలు, జండాలు ఆయన అతనికి థాంక్స్ చెప్పి రేడియోస్టేషన్‌లోకి నడిచాడు.

సి బి యస్. లో పనిచేసే మిత్రుడు యెదురై కంగారుగా చెప్పాడు.

"మా బాబాయి కొడుకులు కవాడిగూడాలో వుంటారు వెధవలు ఎలా వున్నారో. బంద్‌లు లాంటివి వస్తే ఇంట్లో కూచోక రోడ్ల మీద తిరుగుతారు".

"బయట తిరిగితే ఏమౌతుంది!" అడిగాడు ఆయన

"ఏమౌతుందేమిటి! కవాడిగూడలో ఇందాక పోలీసులు కాల్పులు జరిపారని తెల్సినప్పటినుంచి కాళ్ళు, చేతులు ఆడటం లేదు. ఓ సిగరెట్ వుంటే ఇవ్వు బ్రదర్. తాగాలని ప్రాణం పీకేస్తుంది

"ఇద్దరం ఒకే పడవలో షికారు చేస్తున్నాం" చెప్పా డాయన నవ్వి.

"మా అబ్బాయి ఇవాళ బయలుదేరి రాజమండ్రిలో ఇంటర్వ్యూకెళ్ళాలి. బస్సులు లేవు సమయానికి. పౌరజీవితం స్తంభించిపోయింది. మరో మిత్రుడు చెప్తున్నాడు ఆయన తన సెక్షన్‌కి వెళ్ళగానే తను చదవాల్సిన వార్తల కాగితాలని చదివి మొహం ముడుచుకున్నాడు.

ఆర గంట తర్వాత ఆయన స్టూడియోలో మైక్ ముందు కూర్చుని తిరుగుతున్న గడియారం ఎర్ర సెకన్ల ముల్లు వంకే చూస్తున్నాడు.

సరిగా సమయం అవగానే వార్తలు చదవసాగాడు.

"ఆకాశవాణి.... ప్రాంతీయ వార్తలు చదువుతున్నది వృక్షాయుర్వేదాచార్యులు .... జంట నగరాలలో నేడు ప్రతిపక్షాలు నిర్వహించిన బంద్ ఎలాంటి హింసాత్మక చర్యలు లేకుండా శాంతియుతంగా జరిగింది. పౌర జీవనానికి ఎలాంటి అంతరాయాలు కలగటం కాని, అది స్తంభించటం కాని జరగలేదు...."

ఆ వాక్యానికి, మరో వాక్యానికి మధ్య ఆయన తీసుకున్న వ్యవధిలో అను కున్నాడు.

"ఈ వుద్యోగులలో చేరబట్టే నాకు కూతుళ్ళు తప్ప కొడుకులు లేరు."

# ఇడ్లీ కి ఓ కథ వుంది

ప్రియమైన అమ్మకు నీ చతుర్ధ పుత్రుడు నమస్కరించి వ్రాయునది.

నేను క్షేమం. నాన్నగారు, సుశీలక్క కులాసా అని భావిస్తున్నాను. బుజ్జిగాడెలా వున్నాడు? రమణక్క నించి మొన్నీ మధ్య ఉత్తరం వచ్చింది. ఒకసారి ఎవరైనా వెళ్ళే వాళ్ళు వుంటే మన దొడ్డిలోని కరివేపాకు మొక్కలు, అరటి పిలకలు పంపమని నీకు రాయమంది. మాకువచ్చే మూడు డి.ఏ.ను పెంచారు. నెలకి ఏభై దాకా జీతం పెరిగిందన్న మాట. ఆ డబ్బుని స్టెయిన్ లెస్ స్టీల్ దుకాణంలో లాటరీ స్కీములో కడుతున్నాను.